
సాక్షి గుంటూరు

శుక్రవారం । 18 । జూలై । 2025



సాయిబాబాకు పూజలు

పాలువాయి జంక్షన్ (రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 560.70 అడుగులకు చేరింది. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

శివాలయం ఈఓగా గోపి



తాడేపల్లి రూరల్: మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా నామని గోపి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తుళ్లూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారిగా పని చేస్తూ బదిలీపై మంగళగిరి వచ్చారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

న్యూస్‌రీల్

వైభవంగా పవిత్రోత్సవాలు





పెదకాకాని: శివాలయంలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజుల పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం అర్చకులు, వేదపండితులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్, స్థానాచార్యులు పాతూరి సాంబశివరావు పర్యవేక్షణలో ఇవి జరిగాయి. ఈ పవిత్రోత్సవాల్లో చివరిరోజు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఉదయం అన్నదానం, సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో ప్రధాన అర్చకులు పాతూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, అర్చకులు, దాతలు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గిరిజా కల్యాణం పోస్టర్ ఆవిష్కరణ



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం గిరిజా కల్యాణ పోస్టర్‌ను వైశ్యకుల గురువు వామనాశ్రమ మహా స్వామీజీ ఆవిష్కరించారు. ఈ నెల పది నుంచి సెప్టెంబర్ ఏడో తేదీ వరకు చాతుర్మాస దీక్షలో భాగంగా 27న గిరిజా కల్యాణం నిర్వహిస్తున్నట్లు చాతుర్మాస సేవా సమితి కన్వీనర్ తటవర్తి రాంబాబు తెలిపారు. కల్యాణంలో పాల్గొనేందుకు 94406 05773 ఫోను నంబర్‌లో సంప్రదించాలని అన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో గుడివాడ రవి, జుజ్జూరు శ్రీనివాసరావు, బాపారావు, కోటా శేషగిరి, మహంకాళి శ్రీనివాసరావు, సునీత, త్రిపురమల్లు వాణి పాల్గొన్నారు.

బగళాముఖి ఆలయ హుండీ ఆదాయం రూ.6,09,886



కర్లపాలెం: చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ.6,09,886 వచ్చినట్లు ఆలయ ఈవో జి.నరసింహమూర్తి తెలిపారు. గురువారం బాపట్ల డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, చందోలు ఎస్ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ పర్యవేక్షణలో పొన్నూరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ నాగరాజు ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బందితోపాటు అమ్మవారి భక్తులు హుండీ నగదు లెక్కించారు. ప్రతి మూడు నెలలకు అమ్మవారి హుండీ నగదు లెక్కిస్తున్నామని ఈవో తెలిపారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి





భట్టిప్రోలు: పిడుగుపాటుకు గురై బాపట్ల జిల్లాలో గురువారం ఇద్దరు మృతి చెందారు. భట్టిప్రోలు మండలం ఓలేరు శివారు వెంకటరాజు నగర్‌కు చెందిన గుంటూరు లూదు మరియన్న (70) పొలంలో పని చేస్తుండగా గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం ఆరంభమైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో సమీపంలో ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లి తలదాచుకున్నాడు. అత్యంత సమీపంలో పిడుగు పడింది. దీంతో మృతి చెందాడు. గమనించిన స్థానికులు విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు.

మహిళ కూడా...

సంతమాగులూరు(అద్దంకి): పిడుగు పాటుకు మహిళ మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన మండలంలోని ఏల్చూరు గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన వారు పొలాల్లో గేదెలు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు ధాటికి పద్మ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలించారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏడాదిగా ఇన్‌చార్జి పాలనలో వివాదాలకు, అక్రమాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. వర్సిటీ ప్రతిష్ట దిగజారింది. బీఈడీ పరీక్ష పత్రాల లీకేజీ.. దూర విద్య పరీక్షల్లో అక్రమాలు వర్సిటీని అపహాస్యం చేశాయి. వందల మంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించడం, తమ వర్గం వారికి భారీ జీతాలు ఇచ్చి మళ్లీ ఉద్యోగాలు కల్పించడం వంటివి గాడి తప్పిన పాలనకు నిదర్శనంగా నిలిచాయి. నూటా ఎన్నికల్లో న్యాయ స్థానం జోక్యం చేసుకోవాల్సి రావడం అధ్వాన పరిస్థితిని కళ్లకు కట్టింది.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

విద్య దూరం.. వివాదాలే సర్వం!



- అవినీతి కేంద్రంగా ఏఎన్‌యూ
- అక్రమాలే అధికం... అనర్హులే కీలకం
- ఏడాది పాలనలో ఎన్నో వివాదాలు
- ఇన్‌చార్జితోనే నేటికీ కార్యకలాపాలు
- బీఈడీ పరీక్ష పేపర్ లీక్‌తో దిగజారిన ప్రతిష్ట
- సామాజిక న్యాయానికి తిలోదకాలు
- 'నూటా' ఎన్నికల్లో అభాసుపాలు
- మంత్రికి పట్టని వర్సిటీ విషయాలు
- పూర్తి స్థాయి వీసీ నియామకంలో కూటమి సర్కార్ మీనమేషాలు
- గాడి తప్పిన విద్యార్థుల చదువులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వర్సిటీలో తమ వారికి ఒక న్యాయం, మిగిలిన వారికి మరో న్యాయం అన్నట్టుగా ఏడాది పాలన సాగింది. 120 మందికిపైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. 60 సంవత్సరాలు దాటాయని ఐదుగురు ఉద్యోగులను నోటీసులు లేకుండా పంపించేశారు. కాంట్రాక్టు బోధన సిబ్బందికి కూడా నోటీసులు ఇవ్వగా.. కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మిగిలిన వారి వ్యవహారంలో వయో పరిమితి నిబంధనలు పెట్టిన వర్సిటీ అధికారులు తమ వర్గం వారికి 65 సంవత్సరాలు దాటినా సరే రూ.60 వేలు జీతం కలిగిన ఉద్యోగాలు ఇచ్చారు. మాజీ టీడీపీ స్పీకర్ బంధువుగా చెప్పుకొనే ఒక రిటైర్డ్ ఉద్యోగికి, తమ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరికి, మరొక విశ్రాంత ఆచార్యుడికి వయోపరిమితి మినహాయించి ఉద్యోగాలు ఇచ్చారు. పరీక్ష భవన్‌లో కూడా గతంలో పనిచేసిన వారిని తొలగించారు. మహిళలకు ఆ స్థానంలో ఉద్యోగాలిచ్చారు.

'నూటా' ఎన్నికల్లో న్యాయస్థానం జోక్యం

నూటా (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపక సంఘం) ఎన్నికలు మరోసారి అభాసుపాలు అయ్యాయి. అభ్యర్థుల్లో సామాజిక న్యాయం లోపించిందని, కూటమికి దన్నుగా నిలిచిన కాపు, మాదిగ సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పించకపోవడం వివాదాలకు తావిచ్చింది. పాలన పదవుల్లో ఉన్న వారే పోటీ చేయడం తగదని, ఇలా అనేక అంశాలను లేవనెత్తుతూ ఆచార్యులు కోర్టును ఆశ్రయించగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. నూటా ఎన్నికలు వర్సిటీలో వివాదాన్ని రగిలించాయి.

కూటమిలో ఉన్నా వివక్షే

జనసేన సానుభూతిపరులుగా ముద్ర పడిన వారికి గత వైఎస్సార్‌సీపీ హయాంలో రిజిస్ట్రార్ దూర విద్య కేంద్రం కో ఆర్డినేటర్ వంటి పదవులు ఇచ్చారు. కానీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంలో ప్రాధాన్యత గల కో ఆర్డినేటర్ పదవులు కూడా దక్కలేదు. పరిశీలకుల నియామకంలో, మూల్యాంకన విధుల్లో కూడా వీరికి మొండిచేయి చూపారు.కొందరు అధికారులు తమను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని జనసేన కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి.

పట్టించుకోని మంత్రి

ఏఎన్‌యూపై నిత్యం ఫిర్యాదులు వెళుతున్నా.. మీడియాలో కథనాలు వస్తున్నా... విద్యా శాఖ మంత్రి లోకేష్ మాత్రం నోరు మెదపడం లేదు. తన నియోజకవర్గం పరిధిలోకి వచ్చే వర్సిటీలో పాలన పడకేసినా స్పందన శూన్యం. ప్రభుత్వ ఉదాసీనతను అలుసుగా తీసుకున్న కొందరు బోధన, బోధనేతర సిబ్బంది అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నూతన నియామకాలు చేపడుతున్నారు. అతిథి అధ్యాపకులను నిబంధనలకు విరుద్ధంగా సిఫారసుల ద్వారా నియమిస్తున్నారు. ఇప్పటికైనా వర్సిటీకి పూర్తిస్థాయి వీసీని నియమిస్తారో.. లేక ఇదే పద్ధతి కొనసాగిస్తారో.. వేచి చూడాల్సిందే.

ఇవిగో నిదర్శనాలు...

- మార్చి నెలలో బీఈడీ మొదటి సెమిస్టర్ పేపర్ -2 ప్రశ్నపత్రం లీకేజీ యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చింది. మంత్రి జోక్యం చేసుకున్నా వర్సిటీ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- మహిళా వసతి గృహ విద్యార్థులు తమకు భోజనం, సౌకర్యాల కోసం అర్ధరాత్రి చేసిన ఆందోళన వర్సిటీ స్థాయిని ప్రశ్నార్థకంగా మార్చింది.
- పాముకాటుతో క్యాంపస్‌లో విదేశీ విద్యార్థి దుర్మరణం చెందాడు.
- క్యాంపస్‌లో ఒక ఆచార్యుడు ఉద్దేశపూర్వకంగా తనను కారుతో ఢీకొట్టారని ఒక పరిశోధక విద్యార్థిని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- 2024, 2025 సంవత్సరాల్లో ఇన్‌చార్జి పాలనలో దూర విద్య పరీక్షల్లో రూ.కోట్లు చేతులు మారాయని, వర్సిటీ పరిశీలకులకు దేహశుద్ధి జరిగినా ఉన్నతాధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరించారు.
- న్యాయ విభాగంలో గత ఏడాదిలో విద్యార్థులు అనేక సార్లు ఆందోళనలు చేశారు. ఆర్కిటెక్చర్ కోర్సు గాడి తప్పింది.

సామాజిక న్యాయానికి తూట్లు

వర్సిటీలో అధికార పక్షానికి చెందిన సామాజిక వర్గానికి పెద్దపీట వేశారు. గత ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నారంటూ నరసరావుపేట, పిడుగురాళ్లలో కొన్ని పరీక్ష కేంద్రాలను రద్దు చేశారు. ఒక వర్గం వారికి పరీక్ష విధులు కేటాయించేది లేదని ఓ కోఆర్డినేటర్ బహిరంగంగానే చెప్పడం గమనార్హం. ఎస్సీల్లో ఒక వర్గం వారికి ఎలాంటి విధులు కేటాయించవద్దని అనధికార ఆదేశాలు జారీ చేశారు. బలహీన వర్గాలకు చెందిన ఒక అధికారిని తప్పించడానికి ప్రయత్నాలు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు స్వీకరణ



నెహ్రూనగర్: సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ 2024–25 పోటీల్లో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థకు ప్రతిష్ఠాత్మక అవార్డు లభించడం ఆనందంగా ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరాం, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రలు అవార్డును స్వీకరించారు. 23 నగరాలను సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాలుగా కేంద్రం ప్రకటించిందని చెప్పారు. వాటిలో గుంటూరు నిలవడం గర్వ కారణం అని అన్నారు.

సీఎస్‌సీ సేవల్లో గుర్తింపు



యడ్లపాడు: మండలంలోని బోయపాలెంలో గల శ్రీ సాయిగణేష్ సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్)కు సేవల్లో దేశవ్యాప్తంగా రెండో స్థానం లభించింది. 16వ సీఎస్‌సీ దివస్ వేడుకలు ఢిల్లీలోని యశ్‌భూమి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిగణేష్ కేంద్రం నిర్వాహకులు, వంకాయలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు అవార్డును సీఎస్‌సీ సీఈవో సంజయ్‌కుమార్, రాకేష్ నుంచి అందుకున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.

'సాక్షి' చానల్ ప్రసారాల నిలిపివేతపై

వైఎస్సార్‌సీపీ నిరసన



కార్యాలయం అధికారికి వినతిపత్రం అందిస్తున్న పార్టీ నాయకులు

తెనాలి: సాక్షి చానల్ ప్రసారాల నిలిపివేతపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాలతో ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వంలో స్థానిక కేబుల్ చానళ్లలో సాక్షి చానల్‌తోపాటు టీవీ9, ఎన్టీవీ తదితర చానళ్ల ప్రసారాలను నిలిపివేయటం అప్రజాస్వామికం అన్నారు. మీడియా స్వేచ్ఛను హరించటమే కాకుండా, ప్రజలకు వాస్తవాలను తెలియకుండా అడ్డుకోవాలని చూడటమేనని పార్టీ నాయకులు ఆరోపించారు. సూపర్‌సిక్స్ హామీలతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన వందల వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను మోసగించటం, పాలనలో వైఫల్యాలు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించటం వంటి వాస్తవాలను ప్రజా పక్షం వహించి ప్రసారం చేస్తున్న సాక్షి గొంతు నొక్కాలని చూస్తున్నారని విమర్శించారు.

ఒత్తిడి తెచ్చి మరీ...

పార్టీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాయ్‌తో సంబంధం లేకుండా బ్రాడ్‌కాస్టర్లు, ఎంఎస్‌ఓలపై ఒత్తిడి తీసుకొచ్చి సాక్షి ప్రసారాలను నిలిపివేయటం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ అనుకూల చానళ్లపైనా ఇదే చర్య తీసుకోవాలని సందేశం ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. పార్టీ లీగల్ సెల్ న్యాయవాది చింకా సురేష్‌చంద్రయాదవ్ మాట్లాడుతూ కేబుల్ టీవీ ఖాతాదారులకు సాక్షి, మరికొన్ని చానళ్ల ప్రసారాలను అందించకపోవడంపై వినియోగదారుల కోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. అంతవరకు వెళ్లాలని తాము అనుకోవటం లేదని, ఎంఎస్‌ఓలు, బ్రాడ్‌కాస్టర్లను సంప్రదించి అన్ని చానళ్లను ప్రసారం చేయాలని చెప్పారు.

అప్రజాస్వామిక వైఖరి

పార్టీ మహిళా నేత, మున్సిపల్ కౌన్సిలరు కొత్రపాటి యశోద మాట్లాడుతూ భజన చేసే చానళ్లను మాత్రమే ప్రసారం చేస్తూ, విమర్శించే వాటి ప్రసారాలను నిలిపివేయటం అప్రజాస్వామికం అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీల మోసం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, న్యాయవాది మైలా విజయ్‌నాయుడు కూడా మాట్లాడారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, గోల్డ్ రహిమా, తాడిబోయిన రమేష్, బొంతు నరేంద్ర రెడ్డి, మన్నవ ప్రభాకర్, కాకి దేవసహాయం, కొడాలి క్రాంతి, ఆవుల కోటయ్య, పెదలంక వెంకటేశ్వరరావు, కటివరపు దేవానంద్, బండ్లమూడి నాగేశ్వరరావు, అక్కిదాసు కిరణ్, మల్లెబోయిన రాము, అమర్తలూరి సీమోను, పినపాటి రవికిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు గుమ్మడి రవిరాజ్, దాట్ల మోహన్‌రెడ్డి, డి.మల్లికార్జునరెడ్డి, గుంటూరు కృష్ణ, మహిళా నేతలు తమ్మా సుజాతరెడ్డి, షేక్ జకిరా, షేక్ ఇస్రత్, ఇందిర, రెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై 'షార్ట్' పిడుగు

తెనాలి సీబీఎస్ కాలనీలో ఓ కుటుంబం 2020లో ఇంటి నిర్మాణానికి పూనుకుంది. ఇల్లాలి పేరిట మున్సిపాలిటీకి ప్లాను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేశారు. డీపీఎంఎస్ ఆన్‌లైన్‌లో భవన నిర్మాణ అనుమతిని మంజూరు చేశారు. ఆ కుటుంబం సంతోషంగా ఇల్లు నిర్మించుకుంది. ప్రస్తుతం ఆ ఇంటికి 14 శాతం ఖాళీ స్థలం చార్జీగా రూ.3.04 లక్షలు చెల్లించాలంటూ మున్సిపాలిటీ అధికారులు నోటీసు జారీ చేశారు.

- ఎప్పుడో కట్టిన ఇళ్లకు ఇప్పుడు నోటీసులు
- షార్ట్ ఫాల్స్‌కు డబ్బులు చెల్లించాలని డిమాండ్
- లేకుంటే చట్టప్రకారం చర్యలంటూ హెచ్చరిక
- దిక్కుతోచని స్థితిలో ఇళ్ల యజమానులు, ఎల్‌టీపీలు



తెనాలి మున్సిపల్ కార్యాలయ భవనం

తెనాలి: 2016–17 నుంచి నిర్మించుకున్న ఇళ్లకు ఇప్పుడు 2025లో మున్సిపాలిటీ 'షార్ట్ ఫాల్స్' నోటీసులనిస్తోంది. ఇప్పటికే తెనాలిలో 350కి పైగా ఇంటి యజమానులకు నోటీసులు అందాయి. భవన నిర్మాణ అనుమతికి సంబంధించి దరఖాస్తు చేసినపుడు తగిన పూర్తి సమాచారం సమర్పించక పోయినా, అవసరమైన అన్ని ఫీజులు చెల్లించకపోయినా ఆ దరఖాస్తు చెల్లుబాటు కాదనీ, పూర్తి అనుమతిని పొందకుండా ఎలాంటి నిర్మాణం చేసినా, అది అక్రమ నిర్మాణంగా పరిగణిస్తామని స్పష్టంగా జీఓలో ప్రభుత్వ పేర్కొంది. ఆన్‌లైన్‌లో జారీచేసిన భవన నిర్మాణ అనుమతిని రద్దుచేస్తామని, చట్టంలోని నియమ నిబంధనల ప్రకారం అనధికార నిర్మాణాల తొలగింపునకు తదుపరి చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఇంటి యజమానికి నోటీసు ఇవ్వటంతోపాటు అప్పట్లో ఇంటి ప్లానును రూపొందించిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)/ లైసెన్స్‌డ్ ఇంజినీరుకు కాపీని పెడుతున్నారు. నోటీసు అందిన తేదీనుంచి ఏడు రోజులలోపు షార్ట్ ఫాల్స్‌ను పూర్తిచేసి ఫైలును రీసబ్మిట్ చేయాలంటూ వచ్చిన మున్సిపాలిటీ నోటీసులు సదరు ఇంటి యజమానులకు ఆందోళన కలిగిస్తున్నాయి.

దానపత్రాలనూ రిజిస్టర్ చేయాలట..!

ఇంటి నిర్మాణ సమయంలో భవిష్యత్‌లో అవసరమైతే రోడ్డు వెడల్పు కోసమని నిర్ణీత విస్తీర్ణంలోని స్థలాన్ని రూ.100 స్టాంపు పేపరుపై దానపత్రం రాసి, నోటరీ చేసిస్తే అప్రూవల్ ఇచ్చేవారు. ఇప్పుడా దానపత్రాలను బయటకు తీసి రిజిస్టరు చేసి ఇమ్మంటున్నారని ఒక గృహ యజమాని వాపోయారు. రైల్వేశాఖ స్థలానికి 100 మీటర్ల లోపు ఉన్న స్థలంలో ఇల్లు కట్టుకుంటే రైల్వేశాఖ నుంచి ఎన్‌ఓసీ తెచ్చుకునేవారు. కొత్త జీఓ ప్రకారం ఎన్‌ఓసీ రద్దుచేశారు. అప్పట్లో ఎన్‌ఓసీతో దరఖాస్తు చేసినవారిని, మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయమంటున్నారని తెలిసింది. దరఖాస్తులో ఫోన్, ఆధార్ నంబర్లలో ఏదైనా అంకె తప్పు పడితే రద్దుచేసి, మళ్లీ రూ.3 వేల దరఖాస్తు ఫీజుతో రీసబ్మిట్ చేయాలంటున్నారని చెబుతున్నారు.

ప్రభుత్వ ఆదేశం ప్రకారమే...



2016 నుంచి 2025 వరకు నిర్మించుకున్న ఇళ్లలో డాక్యుమెంట్లు సమర్పించని వారు, పూర్తిఫీజులు చెల్లించనివారు, ప్లానుకు భిన్నంగా నిర్మాణం చేసినవారికి నోటీసులిస్తున్నాం. గతంలో ఎందుకు ఊరుకున్నారో తెలియదు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం నోటీసులు ఇస్తున్నాం.

– శివన్నారాయణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్

ఏడెనిమిదేళ్ల క్రితం వాటికి ఇప్పుడు నోటీసులా?

ఏడెనిమిదేళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లకు ఇప్పుడు నోటీసులు ఏంటని యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఏవైనా షార్ట్‌ఫాల్స్ ఉంటే, అప్పుడే సంబంధిత మున్సిపాలిటీ అధికారులు పరిశీలించి, తగిన చర్యలు తీసుకోకుండా ఇన్నేళ్ల తర్వాత నోటీసులు ఇవ్వటం ఏంటనేది చర్చనీయాంశంగా మారింది. కొన్ని ఇళ్లు అమ్మేసుకున్నారు... ఆయా ఇళ్లు చేతులు మారాయి. కుటుంబ సభ్యులు/వారసులకు బదలాయించినవి మరికొన్ని ఉన్నాయి. ఇంటి నిర్మాణ అనుమతుల దరఖాస్తుల్లో తమను బాధ్యులను చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓతో ఎల్‌టీపీ/లైసెన్సుడ్ ఇంజినీర్లు ఇప్పటికే ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అన్నిశాఖల అధికారులు చెక్ చేసుకుని, నిబంధనల ప్రకారం ఉంటేనే అనుమతులు ఇస్తారని, ఇంతకాలం తర్వాత 'షార్ట్‌ఫాల్స్' నోటీసులివ్వటం సమంజసం కాదంటున్నారు.



పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు నిలుపుదల

రూ.85.52 లక్షల విలువైన ఉత్పత్తులపై అధికారుల చర్యలు

కొరిటెపాడు: జిల్లాలోని గుంటూరు నగరం, తెనాలి, ప్రత్తిపాడులో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. గురువారం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీదారులు, టోకు వర్తకులు, రిటైల్ దుకాణాల్లో రెండు బృందాలుగా సోదాలు చేశారు. ఎనిమిది దుకాణాల్లో రూ.57.11 లక్షల విలువైన 318.67 టన్నుల ఎరువులు, 11 దుకాణాల్లో రూ.19.83 లక్షల ఖరీదు చేసే 6,630 లీటర్ల పురుగు మందులు, ఐదు దుకాణాల్లో రూ.8.58 లక్షల విలువైన 1,278 మెట్రిక్ టన్నుల విత్తనాల విక్రయాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో గుంటూరు వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు, ఏడీఏలు పి.మురళీకృష్ణ (పశ్చిమ గోదావరి), ఎం.సునీల్ (గన్నవరం), విజిలెన్స్ సీఐలు కె.వెంకటేశ్వర్లు, సీహెచ్ రవిబాబు, వ్యవసాయ అధికారులు సునీల్‌కుమార్ (ఒంగోలు), బి.కిషోర్‌కుమార్ (గుంటూరు రూరల్) పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,000** గరిష్ఠం : రూ. **1,500**

మోడల్ ధర రూ. **1,200**

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	35,268
అమ్మకాలు	36,922
నిల్వ	7,521

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,400
341	10,000-13,500
సూపర్-10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,500
341	10,000-13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,300
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,700
దేవనూరు డీలక్స్	10,000-12,500
తాలు	5,200 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **845**

కొమ్ములు : **541** బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,300	**10,511**	**10,000**

(ధర రూ॥ల్లో)

కాయలు : **304** బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,300	**10,290**	**10,000**

మొత్తం అమ్మకాలు : **633.750** క్వింటాళ్లు

-దుగ్గిరాల

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

సాయిరామ్ కాదు.. 'సాయం'రామ్

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- ఉపకార వేతనాలతో పేద విద్యార్థులకు ఊతం
- లీగల్ సెల్ రాష్ట్ర నేత పోలూరి వెంకటరెడ్డి
- చదువుకు పేదరికం ఆటంకం కాకూడదు
- అందుకే కోటిరెడ్డి ట్రస్టు ద్వారా సేవలు
- ట్రస్టు వ్యవస్థాపకుడు యేరువ సాయిరామ్
- 1,525 మంది విద్యార్థులకు రూ.50 లక్షలు పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న కొందరు విద్యార్థులతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, యేరువ సాయిరామ్, పోలూరి వెంకటరెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వ్యాఖ్యానించారు. అక్షర సత్యం వంటి ఈ మాటలకు అసలు సిసలు నిర్వచనం యేరువ సాయిరామ్ అని కితాబిచ్చారు. ఏటా పెద్దసంఖ్యలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తూ తన దాతృత్వాన్ని చాటుకుంటున్న సాయిరామ్ పేరు 'సాయం'రామ్‌గా సార్థకమవుతుందని ఎంపీ అభినందించారు. పెద పలకలూరులోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్‌లో యేరువ కోటిరెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన నిరుపేద మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఏటా తరహాలోనే ఈ సంవత్సరం కూడా 50 విద్యా సంస్థల నుంచి అన్ని తరగతులకు చెందిన 1,525 మందికి రూ.50 లక్షల ఉపకార వేతనాలు అందించారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు పోలూరి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎంపీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, స్కాలర్‌షిప్ ద్వారా చదువుకుని ప్రస్తుతం విదేశాల్లో స్థిరపడిన సాయిరామ్ తన గతాన్ని మర్చిపోకుండా సమాజానికి తిరిగి తన చేతనైన సాయం చేస్తూ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఆయన తన తండ్రి కోటిరెడ్డి పేరిట ఏటా రూ.లక్షలను ఉపకార వేతనాలు రూపంలో అందిస్తున్న ఔదార్యాన్ని ప్రశంసించారు. కోటిరెడ్డి భౌతికంగా లేకున్నా... సాయిరామ్ చేస్తున్న కార్యక్రమాల ద్వారా ఎప్పటికీ సజీవంగానే ఉంటారని పేర్కొన్నారు. దీన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీ పిలుపునిచ్చారు. పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉపకార వేతనాలతో నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఊతం లభిస్తుందన్నారు. ట్రస్ట్ సేవలు నిరుపమానమని ప్రశంసించారు. సాయిరామ్ తన తండ్రి పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరు అభినందనీయం అన్నారు. ట్రస్ట్ స్థాపించడమే కాకుండా తన సొంత ఊరైన పెదపలకలూరులో జెడ్పీ హైస్కూలుకు సొంత స్థలాన్ని ఇచ్చి, భవనాన్ని సైతం నిర్మించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు యేరువ జగదీశ్వరి, యేరువ శ్రీవేణి, యేరువ రమణి, యేరువ అభిరాం, పాల సత్యకళ్యాణి, కావ్య, శ్వేత, శ్రీనివాసరెడ్డి, అభినందన్‌రెడ్డి, శ్రీలలిత, మల్లీశ్వరి, మసూద ఫేం బాంధవి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నేత నూనె ఉమామహేశ్వరరెడ్డి, సోమసాని ఝాన్సీ, మెట్టు అంజిరెడ్డి, కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి, ఉడుముల లక్ష్మీ శ్రీనివాసరెడ్డి, నూనె వెంకట కోటిరెడ్డి, నూనె గంగాధర్‌రెడ్డి, శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ శనగల సాంబిరెడ్డి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తరిస్తాం

యేరువ సాయిరామ్ మాట్లాడుతూ తాను చిన్నతనంలో చదువుకునేందుకు పడిన కష్టం మరే విద్యార్థి పడకూడదన్న సంకల్పంతోనే తండ్రి పేరిట ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. తాను విదేశాల్లో పొందిన ఆదాయంలో సింహభాగం పేద విద్యార్థుల ఉన్నతికి ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. చదువుకు పేదరికం ఆటంకం కారాదన్న ఏకైక లక్ష్యంతో ఇదొక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు. భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని ఆయన ప్రకటించారు.

గిట్టుబాటు ధర కోరుతూ రైతుల ధర్నా

- సరైన ధర నిర్ణయించడం లేదని ఆవేదన
- రైతుబజార్‌లో గంటపాటు నిలిచిన విక్రయాలు

నగరంపాలెం: రైతుబజార్‌లోని రైతులు ఒక్కసారిగా ధర్నాకు దిగారు. తమకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోయారు. కొనుగోలుదారులు సైతం ఇబ్బంది పడ్డారు. కృష్ణానగర్ కుందులరోడ్డు రైతుబజార్‌లోని రైతులు గురువారం ఉదయం ఆందోళన బాట పట్టారు. దాదాపు గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గుంటూరు నగరంలోని రైతుబజార్‌లకు కూరగాయల ధరలను నిర్ణయిస్తోంది. వారు నిర్ణయించిన ధరల ప్రకారం ఆయా రైతు బజార్లల్లో విక్రయించాలి. కృష్ణానగర్‌లోని రైతుబజార్‌లో నెల రోజులుగా సరైన గిట్టుబాటు ధరలను నిర్ణయించడం లేదని పలువురు దుకాణాదారులు ఎస్టేట్ అధికారి కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. గుంటూరు నగరంలోని వివిధ గ్రామాల నుంచి సరుకును తీసుకుని ఇక్కడికి వస్తుంటామని రైతులు తెలిపారు. 26 కిలోల టమాటా పెట్టె రూ.800 అని, ఆ పెట్టెను ఆటోలో తీసుకురావడానికి రూ.20 చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. అయితే కిలో టమాటాను రూ.31లకు గురువారం నిర్ణయించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 26 కిలోల పెట్టెను కిలో రూ.31 గా ధర నిర్ణయిస్తే రూ.806లని తెలిపారు. తమకు ఏం గిట్టుబాటు అవుతుందని వాపోయారు. టమాటతోపాటు ఇతర కూరగాయలు, ఆకుకూరల ధరల పరిస్థితి కూడా అలాగే ఉందని తెలిపారు. దీంతో సరైన గిట్టుబాటు ధరల్లేక వ్యాపారుల వద్ద వడ్డీలకు నగదు తీసుకొచ్చి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. రైతుల ధర్నాతో కొనుగోలుదారులు ఇబ్బందులకు గురయ్యారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన

నీరుకొండ (మంగళగిరి): మండలంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, సబ్ కలెక్టర్ భార్గవ్ తేజలతోపాటు పలువురు అధికారులు పరిశీలించారు. గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ -2025 కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.నారాయణరావు, ప్రో వీసీ సతీష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డైరెక్టర్ సీఎల్ అనూప్‌సింగ్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఎం.పార్థసారథి, మంగళగిరి తహసీల్దార్ కే దినేష్ రాఘవ, డీఎస్‌వో చంద్రమౌని, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్వే సర్టిఫికెట్ సృష్టించిన వ్యక్తికి రిమాండ్

పెదకాకాని: ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ సర్వే సర్టిఫికెట్ సృష్టించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని వెంగళరావునగర్‌కి చెందిన కూరాకుల సత్యన్నారాయణ, అనూష దంపతులు తమ ఇంటిని విక్రయానికి పెట్టారు. ఇంటిని కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్ ఇచ్చిన సత్యదేవ్ అనే వ్యక్తి బ్యాంక్ రుణం పొందేందుకు సర్వే సర్టిఫికెట్ కోరడంతో నకిలీ పత్రాన్ని ఆయన ఫోన్‌కు వాట్సాప్ ద్వారా పంపించారు. బ్యాంకర్లను కలిసిన ఆయన అనుమానం వచ్చి తహసీల్దార్ కృష్ణకాంత్‌ను పత్రం గురించి తెలిపారు. విచారణలో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ పత్రం సృష్టించినట్లు నిరూపణ అయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సత్యన్నారాయణను గురువారం అరెస్టు చేశారు. కోర్టుకు హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

చదువు మధ్యలో ఆపేసిన వారికి దూర విద్య వరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హుస్సేన్, సీహెచ్ సురేష్, రామాంజనేయులు

క్రోసూరు: వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపేసిన వారికి దూర విద్య వరం అని జిల్లా కో-ఆర్డినేటర్ ఎంఏ.హుస్సేన్ తెలిపారు. క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దూరవిద్య అడ్మిషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కో-ఆర్డినేటర్ చిల్కా సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా విద్యార్థులు పొందే సర్టిఫికెట్లకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెగ్యులర్ విద్యార్థులతో పాటు సమానమైన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 24 సంవత్సరాలు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. చదవడం, రాయడంతో పాటు ఏదొక తరగతి టీసీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఇంటర్‌కు 10వ తరగతి మార్క్స్ సర్టిఫికెట్, టీసీ, బ్యాంకు అకౌంట్ కాపీ అందజేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అయితే కుల ధ్రువీకరణ పత్రాలు, వికలాంగులు అయితే వైకల్యం ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని తెలిపారు. ఫీజు చెల్లింపునకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 30 వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 15 వరకు అవకాశం ఉందని తెలియజేశారు. వివరాలకు పని వేళల్లో మండల రిసోర్సు కేంద్రంలో, సచివాలయాల్లో, మండల కో-ఆర్డినేటర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. మీసేవ, ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల విచారణ

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారంటూ నమోదైన అక్రమ కేసులో ఇద్దరు వైఎస్సార్ సీపీ నేతలను గురువారం సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐలు నాగమల్లేశ్వరరావు, ఎం.వి.సుబ్బారావులు విచారించారు. పెదకూరపాడు మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకర్రావు, పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలను వేర్వేరుగా పోలీస్టేషన్లలో విచారించి, వారి నుంచి సమాధానాలు రాబట్టి నమోదు చేసుకున్నారు. వీరి వెంట స్టేషన్‌కు వచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ బెల్లంకొండ మండల నాయకుడు చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షురాలు రోళ్ల మాధవి, సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి, క్రోసూరు, అమరావతి మండల నాయకులు నర్రా వాసు, మంగిశెట్టి కోటేశ్వరరావు ఉన్నారు.

విజ్ఞాన్ వర్సిటీకి రూ.58.27 లక్షల ప్రాజెక్ట్



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ఆర్. చరణ్ రాజకు ఢిల్లీలోని ఏఎన్ఆర్ఎఫ్- పీఎంఈసీఆర్‌జీ (అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ - ప్రైమ్ మినిస్టర్స్ ఎర్లీ కెరియర్ రీసెర్చ్ గ్రాంట్) నుంచి రూ.58.27 లక్షల విలువ గల ప్రాజెక్టు మంజూరైందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. పరిశోధనకుగాను రాబోయే 3 సంవత్సరాలకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. ఎం.ఆర్. చరణ్ రాజను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు తదితరులు అభినందించారు.

మహిళా జెడ్పీటీసీ, ఎంపీపీలకు ముగిసిన శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మహిళా జెడ్పీటీసీ, ఎంపీపీలకు జెడ్పీ సమావేశ మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర, విధులు, బాధ్యతలు, గ్రామసభ, విధానాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం, నాయకత్వ ప్రభావం, కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై శిక్షకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'కూటమి' ఒత్తిడితోనే పోలీసులు వేధిస్తున్నారు

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు గురిజవోలు బాధితుల ఫిర్యాదు



చైర్మన్ గంగారామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

నరసరావుపేట రూరల్: పోక్సో చట్టం కింద నమోదైన కేసులో బాధితులమైన తమపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడిలతో నరసరావుపేట రూరల్ పోలీసులు వేధింపుల నుంచి కాపాడాలని నాదెండ్ల మండలం గురిజవోలుకు చెందిన కొండెబోయిన శ్రీనివాసరావు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ కోరారు. విజయవాడకు వచ్చిన జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహీర్‌ను గురువారం శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. మైనర్ అయిన తన కుమార్తెను అనుసరిస్తూ గ్రామానికి చెందిన పుల్లపు విజయ్ కుమార్ కొంతకాలంగా వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. బాలికను హతమార్చే ఉద్దేశంతో కిడ్నాప్ కూడా పాల్పడ్డారని వాపోయారు. పోలీసులు బాలికను గుర్తించి తమకు అప్పగించారని తెలిపారు. కుటుంబ గౌరవం గురించి ఆలోచించి నిందితుడిపై ఎటువంటి ఫిర్యాదు చేయలేదన్నారు. విజయకుమార్ బెదరింపుల కారణంగా బాలికను తన అమ్మమ్మ గ్రామమైన నరసరావుపేట మండలం దొండపాడులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఆ గ్రామానికి వెళ్లి బాలికను బెదిరించి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారని, ఈ సమయంలో మోటర్ సైకిల్, ఫోన్‌లు వదిలి పారిపోయాడని తెలిపారు. విజయకుమార్ వేధింపులతో బాలిక మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో 11 రోజుల పాటు ఐసీయూలో చికిత్స అందించినట్టు పేర్కొన్నారు. బాలిక ఫిర్యాదుతో విజయకుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో విజయకుమార్ కనిపించడం లేదని అతని తల్లిదండ్రులు గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఉద్దేశపూర్వకంగా కేసు నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడిలతో అప్పటి నుంచి రూరల్ పోలీసులు తమను వేధిస్తున్నారని తెలిపారు. తనతో పాటు కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని తెలిపారు. ఈనెల 12వ తేదీన తన కుమారుడు పవన్‌కుమార్ స్టేషన్‌కు పిలిపించి కేసును ఒప్పుకోవాలంటూ విచక్షణా రహితంగా కొట్టారని పేర్కొన్నారు. కేసును అంగీకరించకపోతే ఎన్‌కౌంటర్ చేస్తామని బెదరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో పనిచేస్తున్న పోలీసుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వెంగళరావు యాదవ్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళ్ల శివగోపి పాల్గొన్నారు.

హెచ్ఐవీ రోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. మంజుల

నరసరావుపేట: ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా మందులు తీసుకునే హెచ్ఐవీ రోగులు ప్రతిరోజు సరైన సమయానికి వాటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల చెప్పారు. తన కార్యాలయం నుంచి గురువారం జిల్లా మెడికల్ అండ్ హెల్త్, ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న ఐసీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ సెంటర్లు, స్వచ్ఛంద సంస్థలతో జూలై నాటికి చేసిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీతో జీవించే వారికి మెరుగైన సేవలు అందించడం ద్వారా ఆ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా మందులు తీసుకోని వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. తిరిగి మందులు వాడేలా చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వాడడం వల్ల వైరల్ లోడ్ పూర్తిగా అదుపులో ఉంటుందని చెప్పారు. వైరల్ లోడ్ పరీక్షలో 200 కన్నా తక్కువ కాపీలు వస్తే వారిద్వారా ఇతరులకు హెచ్ఐవీ వ్యాపించదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ బాషా, ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

గుంటూరు వాసిగా గుర్తింపు

ఉంగుటూరు: ఉంగుటూరులోని ఏలూరు కాలువలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు గుంటూరుకు చెందిన గుంజి దుర్గనారాయణ (42)గా పోలీసులు గుర్తించారు. మద్యం తాగి మతి స్థిమితం లేనట్లుగా తిరుగుతుంటాడని, ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని, అతడి పోలియో ఉందని చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపారు. నాలుగు రోజులు క్రితం గూడెం ప్రాంతంలో కాలువలో పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. అతని జేబులో ఉన్న వివరాల ప్రకారం సమాచారాన్ని బంధువులకు తెలియజేసినట్లు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించాక మృతదేహాన్ని తాడేపల్లిగూడెం మార్చురీలో భద్రపరిచారు.

బైక్‌పై నుంచి పడ్డ వృద్ధురాలు మృతి

బల్లికురవ: బీపీతో కళ్లు తిరగటంతో బైక్‌పై కూర్చున్న వృద్ధురాలు కిందపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. అందిన సమాచారం ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట గొట్టిపాడు గ్రామానికి చెందిన గుంటకల గోవిందమ్మ (56) కుమారుడు నాగేంద్రబాబుతో కలసి పని నిమిత్తం మంగళవారం బైక్‌పై పల్నాడు జిల్లా నాగులవరం వెళ్లింది. సాయంత్రం తిరిగి వస్తుండగా మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రురాలిని 108 వాహనంలో ప్రాథమిక చికిత్సకు గుంటుపల్లి పీహెచ్‌సీకి, అక్కడ నుంచి చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది.

జిల్లా స్థాయిలో మాచవరం పీహెచ్‌సీకి మొదటి స్థానం

మాచవరం: గ్రామీణ ప్రాంత ప్రజలకు జూన్‌లో మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించినందుకు గానూ మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లాలో మొదటి స్థానం దక్కిందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. ప్రసాదరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా అందిస్తున్న వైద్య సేవల్లోనూ రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిందని ఆయన తెలియజేశారు.

ఎక్కడో హత్య .. ఇక్కడే దహనం!

- మిస్టరీగా మారుతున్న శవ దహనాలు
- ఒకే తీరున మూడేళ్లలో నాలుగో ఘటన
- పోలీసులకు సవాల్‌గా మారిన కేసులు



యడ్లపాడు హైవే పక్క కాల్వలో ఫ్లెక్సీ చుట్టి కాల్చిన శవాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

యడ్లపాడు: మండలంలో వరుసగా నమోదవుతున్న అజ్ఞాత శవాల దహనం ఘటనలు పోలీసులు సవాలుగా మారాయి. తాజాగా జూన్ 25న ఉదయం 8.30 గంటల ప్రాంతంలో 16వ జాతీయ రహదారి పక్కన పట్టపగలే శవ దహనం స్థానికులను కలవరపెట్టింది. 20 రోజులకు పైగా గడుస్తున్నా ఇప్పటివరకు ఈ కేసు మిస్టరీగానే ఉంది. హత్య చేసిన తర్వాత మృతదేహాలను యడ్లపాడు మండలంలో దహనం చేయడం హంతకుల వ్యూహంలో భాగమని పోలీసులు అనుమానిస్తున్నారు.

మూడేళ్లలో నాలుగు ఘటనలు

గత మూడేళ్లలో మండలంలో మొత్తం నాలుగు శవ దహనాల ఘటనలు నమోదయ్యాయి. బోయపాలెం- వంకాయలపాడు గ్రామాల మధ్యలో హైవే సర్వీసు రోడ్డు పక్కన చెత్తకుప్పలో ఒకరిని, యడ్లపాడు నుంచి చిలకలూరిపేట వెళ్లే మార్గంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన అండర్‌పాస్ వంతెన సమీపంలో సుబాబుల్‌తోట పక్కనే ఒకరు, సొలస గ్రామంలోని శ్మశానవాటికలో ఒకరిని కాల్చివేసిన సంఘటనలు వెలుగు చూశాయి. తాజాగా గతనెల 25న జరిగిన ఘటన వీటి జాబితాలోకి వచ్చి చేరింది.

ఆ ఒక్కటే ఆధారం !

చివరగా జరిగిన ఘటనలో మాత్రం ఒక ఆధారం లభించింది. హంతకులు పట్టపగలే ఫ్లెక్సీ షీట్‌లో చుట్టిన శవాన్ని హైవే పక్కనున్న కాల్వలో పడేసి నిప్పంటించి పరారయ్యారు. అదే సమయంలో పెట్రోలింగ్ చేస్తూ ఆవైపు వెళ్లిన పోలీసులు మంటలు గమనించి, వాహనంలోని నీటితో మంటలను ఆర్పారు. అయితే, అప్పటికే శరీరం పూర్తిగా కాలి బూడిదైంది. ముఖ భాగం మాత్రమే కొంతమేర మిగిలింది. ఆ ఒక్క ఆధారంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తి గురించి ఏ పోలీస్ స్టేషన్‌లోనూ మిస్సింగ్ కేసు రిజిస్టర్ కాకపోవడం పోలీసులకు ట్విస్ట్‌గా మారింది. హంతకులు శవాన్ని ఫ్లెక్సీ షీట్‌తో చుట్టి నిప్పు పెట్టిన విషయం తప్పా హత్యకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఏవీ లభించలేదు. పెట్రోల్ పోసి పూర్తిగా దహనం చేయడంతో ఆధారాలు మిగలకుండా జాగ్రత్త పడ్డారు. పోలీసులు శవం ముఖం ఫోటోనే కీలక ఆధారంగా చేసుకుని కేసును ఛేదించే ప్రయత్నం చేస్తున్నారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ సహకారంతో డీఎన్ఏ పరీక్షలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు చేపట్టారు. ఘటన జరిగిన తేదీన అనుమానాస్పద వ్యక్తుల రాకపోకలపై నిఘా పెట్టారు. ఈ ఒక్క హత్యకేసు ఛేదించగలిగితే మిగిలిన వాటిలో ఏదన్న ఆధారం లభిస్తుందేమోనని పోలీసులు భావిస్తున్నారు.

ముక్తేశ్వరుని సాక్షిగా ఇసుక అక్రమ తవ్వకాలు



మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయం సమీపంలో జరుగుతున్న అక్రమ మట్టి త్రవ్వకాలు

రేపల్లె: సాక్షాత్తూ ముక్కంటి కనులు కప్పి కూటమి నేతలు అక్రమ ఇసుక తవ్వకాలకు బరితెగించారు. దక్షిణకాశీగా పేర్గాంచిన రేపల్లె మండలం మోర్తోట గ్రామంలో పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయ సమీపంలో కూటమి నేతల కనుసన్నలలో అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆలయానికి కేవలం 300 మీటర్ల దూరంలో కృష్ణమ్మ ఒడ్డున జేసీబీలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రసిద్ధిగాంచిన ముక్తేశ్వరస్వామి ఆలయానికి సాధారణ రోజులతో పాటు కార్తికమాసంలో భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకుని కృష్ణానదిలో పుణ్యస్నానమాచరిస్తుంటారు. కృష్ణానదిలో నీరు తక్కువగా ఉండటంతో ఇదే అదునుగా భావించిన కూటమినేత కన్నుసన్నలలో ఇసుకాసురులు జేసీబీల ద్వారా గుంతలు తవ్వి ఇసుకను తరలిస్తున్నారు. దీంతో ప్రకృతి సంపద తరలిపోవటంతోపాటు భవిష్యత్‌లో తవ్విన ప్రాంతాలలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.